# దీవెన

కన్యాం కనకసంపన్నాం
కనకాభరణై ర్యుతాం
దాస్యామి విష్ణవే తుభ్యం
బ్రహ్మలోక జిగీషయా...
కన్యే మమా గ్రతో భూయాః
కన్యే మే దేహి పార్శ్వయోః
కన్యే మే సర్వతో భూయాత్
త్వద్దానా న్మోక్ష మాప్నుయామ్.

సముద్రపు హోరులాంటి బ్యాండుమేళపు గానాన్ని ముంచెత్తేసే కంఠంతో పురోహితుడు కన్యాదానం చేయిస్తు న్నాడు. రుక్మిణమ్మ మనుమరాలి పెండ్లి పందిట్లోంచి చూడ కుండా, వంటశాలలో గాడిపొయ్యిదగ్గర గాడిపొయ్యిలా మండే గుండెలతో కూర్చుంది. ఆమె కళ్ళలో జలపాతాలు, మనస్సులో సుడిగుండాలు.

'తక్కువ నోములునోచి ఎక్కువ ఫలాలు ఆసిస్తే ఏంలాభం! పెట్టిపుట్టొద్దూ. శాంతమ్మలాంటి పిల్ల కోడ లెలా అవుతుంది. గౌరీపూజచేస్తూ బుట్టలో కూచున్నదాన్నిచూస్తే ఉంగరంలో కెంపులావుంది. చిదిపి దీపంపెట్టవచ్చు. అవును. నాకా యోగంలేదు. నాగితే బాగుంటే ఆ మహారాజే బతి కుండేవారు. పోనీ ఆయనకీలోకంలో నీళ్ళు ప్రాప్తంలేక

వెళ్ళిపోయారు. వీడేనా సవ్యంగా ఉండకూడదూ! అని వాపోయింది రుక్మిణమ్మ.

'ధర్మేచా - అర్థేచా - కామేచా త్వయైషా నాతి చరితవ్యా - నాతి చరామి'

కత్తిలాంటి కంఠంతో బ్రహ్మ మంత్రం చదువుతున్నాడు. పెళ్ళి మంత్రాలన్నీ కంఠతావచ్చిన రుక్మిణమ్మ వంటశాలలోనే కళపెళ మరుగుతూన్న ఉక్రోషంతో 'ఇంక తెరసెల్లా తీసేసివుంటారు. కళ్ళుగలభాగ్యం వెళ్ళిచూడనా? ఇద్దరి కిద్దరూ గ్యాసులైట్లలా వెలిగిపోతూ తమ మధ్యనున్న వెండి మేఘంలాంటి తెరతొలగగానే ఒకర్నొకరు చూసుకుంటారు వెళ్ళిచూడనా' అనుకొంది.

'ఎందుకూ వెళ్ళడం? ఏమిటిచూస్తా! నాకొడుక్కి చేసుకుందామనుకొన్న పిల్లని ఇంకొకడు చేసుకోడమా? ఎన్ని పెళ్ళిళ్ళుచూస్తూ, చూసిన ప్రతిపెళ్ళిలోనూ మా వెంకట్రావుడూ ఇలాగే కూర్చుంటాడు, ఎదురుగా ముద్దులమూటలా కుందనంబొమ్మలా శాంతమ్మ గంపలో కూచుంటుంది అనుకొన్నాను. ఏంలాభం? ఎన్ననుకుంటేనేం వాడి కా ప్రాప్తం లేదు. ఐనా వాడు తిన్నగా ఉండకూడదూ' అనికళ్ళు ఒత్తుకుంటూ గుంజాటనపడ్డది రుక్మిణమ్మ.

వెంకట్రావుడు తిన్నగా ఉండడు. ఒక్కపది నిమిషాల కిందటే "గౌరీపూజ దండ తీసుకురావాలిరా, లేవరా వెంకట్రావుడూ" అని ఎంతమంది వెళ్ళి బతిమాలినా "ససేమిరా, ఆటలోంచి ఇప్పుడులేస్తే అదృష్టం తిరిగిపోతుం"దని మంకు

పట్టుపట్టి లేవలేదు. చివరికి రుక్మిణమ్మే స్వయంగా వెళ్ళి "అవతల మూడుముళ్ళూ పడే వేళయింది, లేరా" అని బామాలితే "ఇవతల మూడుఆసులుపడే లగ్నంకూడా మించిపోతుం" దని భీష్మించుక్కూర్చున్నాడు. కొడుకు చేస్తున్న తప్పు తనదే అన్నట్లు బాధపడి మరిపందిట్లో ఉండలేక వంటశాలలోకి వెళ్ళిపోయింది రుక్మిణమ్మ.

'ఇలాంటి వాడి కెవరు పిల్లనిస్తారు? ఇంతకీకర్మ, కర్మ' అనుకుంది. ఆమెగుండె కాలుతూన్న స్టౌలోవుండే మధ్య బిళ్ళలా ఎర్రగా మండుతున్నాది. ముసుగు సవరించుకుంటూ పందిట్లోంచివచ్చే హాయిహేసలాంటి వేదఘోషతోపాటు తనలోపటిగొంతుకను మేళవించి "ధృవంతేరాజా వరుణో ధృవం దేవో బృహస్పతిః-ధృవంత ఇంద్రశ్చా-అగ్నిశ్చరాష్ట్రం ధారయతాం ధృవం!" అని మంత్రం వర్ణించుకొంది. వరుడి చేత వధువునెత్తిమీాదజీలకర్రా బెల్లంపెట్టిస్తున్నారు. "ధృవం! ధృవం! అవును వెంకట్రాముడికి ఆరుపోగులూపడవు ధృవం!" అనుకొంది రుక్మిణమ్మ.

ఆమె వంటశాలలో కాలుగాలిన పిల్లిలా తిరగడం చూసి వంటబ్రాహ్మణుడు "ఏం వదినా! మనమరాలిపెళ్ళి అవుతూవుంటే నువ్వు వంటింట్లోనే ఉండిపోయావు? వెళ్ళమ్మా వెళ్ళు. నీ కేంబెంగా అక్కర్లేదు. నేను నడుంకట్టేక ఎన్ని గుండిగలేనా ఇట్టే వార్చేస్తాను. అయినా ఈ రేపను రోజుల్లో వంట లెంపటలు? పట్టుమని పదిగుండిగలేనా వార్చ క్కర్లేదు. బూరెలా! ఈరోజుల్లో కుర్రాళ్ళు రెండుబూరెలు

విస్తట్లో పడగానే చెయ్యిఅడ్డుపెట్టేస్తారు. వెళ్ళు, వదినా! వెళ్ళు, మనమరాలు తలంబ్రాలు పోయడం వెళ్ళిచూడు. తలంబ్రాలదాకా వచ్చిందా!" అని ప్రశ్నించాడు.

రుక్మిణమ్మ "పెళ్ళి చూస్తూ కూచుంటే పనులవుతాయా అచ్చన్నమావా! ఏవుంది. ఇంకోగంటలో భోజనాలకిలేస్తారు. నేనేచూసుకోకపోతే మరెవరుచూస్తారు చెప్పు?" అని సమాధానం చెప్పి తన మధనకి మారువేషం వేసింది

"ఏవమ్మోయ్! మాఅన్నయ్యలా శౌర్యంచూపెడదామనుకున్నావా? వీడు అచ్చన్న సుమా! మాటకి మరి రెండు మాటలు లేవు. నువ్వువెళ్ళి పెళ్ళి చూడమ్మా" అన్నాడు. తన మొగుడు పాతికేళ్ళకిందట ఒకపెళ్ళిలో వంట బ్రాహ్మణులు తగాదాపెట్టి గరిటెలు కిందపడేసి వెళ్ళిపోతే ఒక్కచేతిమీదుగా వంటంతా పూర్తిచేశాడు. ఆకథని అచ్చన్న జ్ఞాపకంచేయగానే రుక్మిణమ్మ మనస్సు మరీ కలతపడ్డాది. "ఆయనే ఉంటేనా?" అనుకుంది.

"దానికేంగానీ అచ్చన్నమావా! మొగపెళ్ళివాళ్ళు అసాధ్యుల్లా వున్నారు. పదార్థాలు లేవనిపించి అనాడీచేద్దామనుకుంటున్నారట. చూడూ, చిన్నచిన్న విషయాల్లోనే మనం జాగ్రత్త తీసుకోవాలి. అప్పడాలపిండి కొంచెం లావుగానే చెయ్యాలి! అన్నట్లు పులుసులోముక్కలు! వంకాయముక్కలు తరగనా? అని పురమాయించుకొని తనబాధలో తాను పడిపోయింది

కూరముక్కలు తరుగుతూ తన గుండెనే ముక్కలు ముక్కలుగా తరుగుతున్నట్టు భావించుకొంది. 'మావాడిని అనుకుంటున్నానుగాని ఈ పెళ్ళికొడుకు రామ్మూర్తి మట్టుకూ తిన్ననయినవాడా? మంత్రాలూ తంత్రాలూ వద్దు - కిరస్తానీవాళ్ళలాగ ఉంగరాలు మార్చుకొని, కాగితంమీదసంతకాలుపెట్టి పెళ్ళి చేసుకుంటాను అని నిన్న మొన్నటిదాకా మొండిపట్టుపట్టలేదూ? 'రామ్మూర్తికి దేవతలలో నమ్మకం లేదట - పెళ్ళికి బతికున్న మనుష్యులు సాక్ష్యులుగా ఉండాలిగాని ప్రాణంలేని నీరూ నిప్పూ సాక్ష్యాలేమిటని టోకాయించి మరీ అడిగేడట - ఇంకా పైపెచ్చు అగ్నిపూజిస్తే మనవూ అడవిమృగాలలాంటి కొండవాళ్ళమే, నన్నాడట- మా వెంకట్రావు ఇంతకన్న చెడిపోయాడా!" అని ప్రశ్నించుకుంది రుక్మిణమ్మ - లేదని తనే సమాధానం చెప్పుకుంటె.

'ఎవరేనా పిల్లనిస్తామనివస్తే మావాడు శాస్త్రోక్తంగా పుస్తె ముడికట్టడూ? ఎంతచెడిపోయినా దేవుడూ, భయం, భక్తీ అన్నవి పోలేదు - ఆమధ్య ప్రాణంమీద కొస్తే ఏడుకొండలవాడికి మొక్కుకోరా అంటే మొక్కుకోలేదూ? ఈ పెళ్ళికొడుకా? వెయ్యి నూటపదహార్లు ఆశపెడితే పసుపుబట్టలు కట్టుకొని పీటలమీద కూచున్నాడు - విఘ్నేశ్వర పూజ చెయ్యాలోయి అని ప్రధానంనాడు అంటే దేవుడిమీద పువ్వులు విసిరికొట్టేడు! ఇంతకన్నా చెడిపోలేదు వెంకట్రాముడు. వీడికేయిస్తే ఆఖర్చులన్నీ కలిసొచ్చుగా' అనుకొంది రుక్మిణమ్మ.

వెంకట్రాముడు పూర్తిగా చెడిపోయాడనీ, వాడు చెడిపోవడం వేరు రామ్మూర్తి చెడిపోవడం వేరనీ రుక్మిణమ్మకూ తెలుసు - కాని తల్లిపేగు. అందుకే వాడిని వెనకేసుకుని వచ్చి వాడుచేస్తున్న ఘనకార్యాలన్నీ సమర్థించుకుంటూ వస్తున్నది. వెంకట్రాముడు చిన్నప్పట్నుంచీ ఇదే వరస.

మొగుడు పోయినదగ్గర్నుంచీ రుక్మిణమ్మ కొడుకుని తీసుకుని కూతురుదగ్గర ఉంటున్నాది. ఉన్నఆ స్త్రీపా స్త్రీవ్యవహారాలన్నీ అల్లుడేచూస్తున్నాడు. వెంకట్రాముడుని కన్నకొడుకుకన్నా ఎక్కువగా చూసుకుంటూ చదువూసంధ్యా చెప్పించి వాణ్ణి ప్రయోజకుణ్ణి చేద్దామనుకున్నాడు గానీ తనే చేతులారా చేసుకుంది.

వెంకడికి ఏడేళ్ళప్పుడు-కుర్రాడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పొద్దున్న వెళ్ళిపోయినవాడు ఎంతరాత్రికీ ఇంటికి రాలేదు-లాంతర్లు పుచ్చుకొని ఇరుగు పొరుగు వాళ్ళతో పట్నమంతా గాలించాడు, అల్లుడు. వెంకడు ఒక నాటకాల కంపెనీవాళ్ళ ఇంట్లో బీడీలు కాల్చుకుంటూ దొరికేడు. బుగ్గ కయిదు వేళ్ళూ అంటుకుపోయేటట్టు ఛెళ్ళున చెంపకాయలు కొడుతూ ఇంటికి ఈడ్చుకొచ్చేడు అల్లుడు. కుర్రాడు గిలగిలా కొట్టుకుంటూ తన్నుచుట్టుకుని బావురుమని ఏడ్చాడు. వాడి ఏడుపు చూడలేక "చేతి కెంత దెబ్బవస్తే అంతదెబ్బ కొడుతారా! చిన్నవాడు తెలియకచేస్తే నయానా భయానా

చెప్పాలిగాని" అంటూ అల్లుడితో దెబ్బలాట పెట్టుకుంది. ఆనాటినుంచీ అల్లుడు వెంకట్రాముడు ఇంట్లో ఉన్నాడో లేదో, బడికి వెళుతున్నాడో లేదో పట్టించుకోలేదు. ఆనాడే తను ముద్దుచెయ్యకపోతేనా!

నిజమంతే! తను చేతులారా చేసుకుంది-పుత్రాణ్ని తను అడుపాజల్లో పెట్టుకోలేకపోయింది- అల్లుణ్ని పెట్ట నిచ్చిందికాదు-వాడు రెండేరెండురోజులకు కలకత్తా చెన్నా పట్నం పారిపోతూవుంటే-ఒక్కగాని ఒక్కకొడుకని టెలిగ్రాం మనియార్డరుకట్టి తిరిగి తీసుకొచ్చేది- ఇదిచూసి అల్లుడు ఏవ గించుకొని పెళ్ళాన్నిచూసి జాలిపడి ఊరుకునేవాడు. మొక్కగా ఉన్నప్పుడే వంచవలసింది. ఇప్పు డేడిస్తే ఏం లాభం!

పందిట్లో బ్రహ్మ లోహకంఠంతో సింహంలా-

మాంగళ్యతంతునానేన
మమ జీవనహేతునా
కంఠే బధ్నామి సుభగే
త్వం జీవ శరదాం శతమ్"

అని చెప్పిస్తూ మూడుముళ్ళూ వేయిస్తున్నాడు. పందిట్లో ఉన్నవాళ్ళలో ఆనందం మహోదయవేళ సాగరంలా ఉప్పొంగుతున్నది. రుక్మిణమ్మమట్టుకు మనస్సులో కుళ్ళి పోతున్నది.

'అయింది. మాంగళసూత్రధారణకూడా అయింది. ఇంక శాంతమ్మ మనవరాలే! కోడ లవుతుందన్న ఆశ పూర్తిగా హరించుకుపోయింది' అని నిటూర్చింది రుక్మిణమ్మ. శాంత పుట్టినప్పటినుంచీ రుక్మిణమ్మ ఈఆశ పెట్టుకుంది. తనకొడుక్కి పిల్ల నిస్తామని ఎవరూ రారని-అందుకే శాంత తప్పటడుగులు వేస్తూ ముద్దుముద్దుమాటలు చిలకలా పలుకుతున్నప్పుడు పిల్లని ఒళ్ళోపెట్టుకొని 'ఏవే మావని పెళ్ళాడుతావటే' అని అడిగేది.పిల్లవద్దంటే 'మావకన్నా మంచి మొగుడొస్తాడే! మావనే పెళ్ళాడు. జీలకర్ర బెల్లం పెడతాడు' అని బెల్లం ఆశతో పిల్లని ఎలాగో ఒప్పించేది. ఇదంతా చుట్టుపక్కల ఎవరూ లేనప్పుడు - ఎవరేనా వింటే నవ్విపోతారు.

శాంతకి జ్ఞాపకశక్తి ఎదక్కముందే ఈరకం తృప్తిపడ డాన్నికూడా చంపుకోవలసివచ్చింది. అప్పటికి వెంకట్రాముడు బాగుపడే సూచనలు లేవు నాటకం వాళ్ళకోటీ, భోగంవాళ్ళ వెనకా జోరుగా తిరుగుతూండేవాడు-కాబట్టే కూతురితోకూడా 'అమ్మా, శాంతని మీతమ్ముడు కిచ్చి వాణ్ణొకయింటివాడిని చేద్దూ' అని నోరెత్తి అడగలేక పోయింది. మనస్సులోనే కోరికను కుళ్ళనిచ్చింది.

ఆలోచిస్తూ కూరతరుగుతూ చెయ్యికోసుకొంది రుక్మిణమ్మ. రక్తంవస్తే ఆవేలు నోట్లోపెట్టుకొని దేముడి గూటి దగ్గిరకు పోయి కుంకంపెట్టి కట్టుకట్టి మళ్ళా ఆలోచనలో పడ్డాది.

నిజమే! అల్లుడి తప్పు లేదు. చదువుకోక నాటకాలవాళ్ళతో తిరిగితే ఎవరిది తప్పు. కుఱ్ఱాడిది కాదు, తనదే. తను ఆనాడే మేలుకుంటే వీడింత చెడిపోకపోను. వాడు సవ్యంగా చదువు కుంటే ఈ రామ్మూర్తికి తీసిపోయేవాడా? అప్పుడు మేన కోడల్ని చేసుకోవాల్సిన గతి పట్టదు. దేశదేశాలనుంచి పిల్ల నిస్తామని రాకపోరు. తనకీ ఆస్తి కొద్దోగొప్పో అయిదెకరాల చెక్క, నగదు వెయ్యి రూపాయలు. కాని వెంకట్రాముడి కా యోగం రాయలేదు.

దేవుడు పక్షపాతం చూపిస్తాడా? రాముడం గీముడం కాదు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసి ఉపయో గించుకోకపోతే ఎవరున్నా ప్రయోజనం లేదు. ఈ జన్మకి వాడికింతే. పగలల్లా ఆ దెయ్యాల మేడలో దెయ్యాల్లా కూర్చుని పేకాడడం, సాయంత్రం తప్పతాగి ఆ సానిదాని కొంపకు చేరుకోవడం. ఇంతే! మరి వీడికి మోక్షం లేదు అని నిశ్చయించుకుంది రుక్మిణమ్మ.

అఖండ గౌతమిలాంటి ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోతున్న సర్వేంద్రియాలూ ఒక్క కొడుకు విషయం మీద చింతలో కేంద్రీకరించబడ్డాయి. పందిట్లో కోలా హలంతో తలంబ్రాలు పోయిస్తున్నారు. కాని రుక్మిణమ్మ ఈ లోకంలో లేదు. తన ఆలోచనలో మునిగిపోయింది.

'ఏదో తల్లి ప్రేమ కాబట్టి ఇలా కుమిలిపోతున్నాను గాని వెంకట్రాముడికే శాంతనిచ్చి పెండ్లి చేస్తే-! దాని జీవి

తాన్ని గంగపాలు చేసినదాన్ని అవుతాను! శాంత నిజంగా చక్కనిచుక్క. అక్షరాలా శాంతమ్మే. ఇలాంటి కుందనపు బొమ్మని నా ముద్దూ ముచ్చటా తీరిందికి ఆ రాక్షసుడి చేతిలో పెడితే- తానా సుఖపడదు- దాన్నా సుఖపెట్టదు- నాకేం బతికినన్నాళ్ళు మరి బతకను - శాంత నాలుగు కాలాలపాటు కాపరం చెయ్యాలి- దాని గతేంకాను' అని యథార్థవిషయాల కొచ్చింది. లోకంలో అందరాడపిల్లలు ఏదోవిధంగా శాంతలే అని గుర్తించుకొందికి రుక్మిణమ్మకి ఎంతోసేపు పట్టలేదు.

అవును. ముందు అనుకున్నాను. పెళ్ళన్నది అయిపోతే బాధ్యత తలకెక్కి వీడి ఆటలు కడతాయని. కాని వీణ్ణి కట్టు కున్న ఏఆడది సుఖపడుతుంది? అదీకాక వీడికి బాధ్యతేమిటి? బాధ్యతే గుర్తెరిగివుంటే తల్లిని నన్నిలా వాళ్ళింట్లో ఒదిలేసి ఉండునా? ఏదో ఇల్లుచూసి కాపరంపెట్టడూ! వేళ కింత ఉడ కేసిపెట్టనూ? వీడువంశానికి అపకీర్తనిగానీ, బావకి అప్రదిష్ట అనిగానీ ఆలోచిస్తే ఏనాడో సవ్యంగా సజావుగా బతకనేర్చి వుండును. ముండ నుంచుకున్నా సంసారపక్షంగా దానితోనే సుఖంగా కాపరంచేసేవా ళ్ళెంతమంది లేరు. అలా బతికినా నాకు ఈబాధలేకపోను.'

రుక్మిణమ్మ తనచుట్టూ తన ఆలోచనలతో ఒకగోడ కట్టుకొని దానిలో ఖైదీలా బాధపడుతూ కన్నీళ్ళుకార్చింది.

ఇప్పటిదాకా ఆమె ఆఫూళ్ళో ఎన్ని పెళ్ళిళ్ళు అయేయో అన్నిట్లోనూ కూర్చుని హరిఃఓంనుంచీ ఇతిశ్రీ దాకా తంతంతాచూస్తూ తన కొడుకుపెళ్ళికూడా ఇలాగే జరుగుతుందని ఆశలు అల్లుకుంది. చాలా రాత్రిళ్ళు తనే మంత్రాలు చదువుతూ కొడుక్కి పెళ్ళిచేస్తున్నట్లు కలలు కూడా కంది. ఏడుకొండలవాడితో సహా ఎందరు దేముళ్ళకు మొక్కుకోవాలో అందరిదేముళ్ళకూ మొక్కుకుంది. ఆఖరికి దక్షిణాదిని ఇంకా ఆడపిల్లలిని అమ్ముకునే ఆచారం ఉందని విని అలాకూడా తనకోర్కెను తీర్చుకుందామనుకుంది. కాని కొడుకే ఓనాడు 'నాకు పెళ్ళేమిటే' అని కుండబద్దలుకొట్టి నట్టు చెప్పేశాడు.

వాడికి పెళ్ళితో నిమిత్తంలేదు. వంశాన్ని నిలబెట్టేందికీ, తద్దినాలు బెట్టేందికీ, పెంపకాలుకూడా చేసుకుంటారు. అలాంటిది వీడొట్టి శాక్తేయుడులా ఉన్నాడు. ఎటోచ్చీ తనే ఇలా మథన పడడం.

మథనపడ్డా ఏంలాభం? ఎప్పుడో ఓనాడు ఆ పేకాటలో జెళ్లేలొచ్చి ఒకర్నొకరు పొడుచుకుచస్తారు. లేదా తాగితాగి కళ్ళుపేలి చస్తారు. ఒళ్ళు సరిగా చూసుకుంటేగా! ఎన్నిసార్లు ఇకమీదట ఆమూడూ మానకపోతే నా పొగ చూసినట్లే అని ఒట్టుకోడం. ఒట్టూ, సత్యాం అంటే ఖాతరు ఉంటేకదా? మరి వెంకట్రామయ్యా బాగుపడడు. ఇందుకు తను వాపోడంకూడా అనవసరం. కాబట్టి కొడుకూ,

కోడలూ, ముద్దూ ముచ్చటా అని ఆకాశసౌధాలు కట్టుకోన క్కరలేదు. కొడుకు నైజం తెలిసుండికూడా శాంతమ్మని కొడిక్కిస్తే బాగుండుననుకోడం రుక్మిణమ్మ కిప్పుడొక ఘోర మైన పాపంగా తోచింది. 'ఎంతపాపం చేశాను!' అని అను కుంది రుక్మిణమ్మ.

'అమ్మమ్మా మావయ్య నిన్ను సరిగ్గాచూడ లేదని ఖిన్నపడకు. నాపెళ్ళి అయిపోయాక నాతోపాటే మా అత్తా రింటికి వచ్చి నాకు తోడుగా ఉండు. నీకేం లోపమూ రాని వ్వ' నని అన్న పిల్లజీవితాన్ని తనకు లోగడ సుస్తీ చేసి నప్పుడు కొడుకులా ఇరవైనాలుగు గంటలూ తనదగ్గరేఉండి సమస్తోపచారాలూ చేసినపిల్ల భవితవ్యాన్ని కోడల్ని చేసు కొని ఖూనీ చేద్దామనుకోడం బ్రహ్మహత్యలాంటి పాతకం అని ఆలోచించినకొద్దీ నిశ్చయించుకొంది రుక్మిణమ్మ.

'శాంతమ్మ ఈ రామ్మూర్తితోపాటు పదికాలాలపాటు కాపరంచేసి గంపెడు పిల్లల్నెత్తుకుంటే నాక దేపదివేలు. దాన్ని కనిపెట్టకుని ఇప్పుడు కూతురికి పనిపాట్లు చేసినట్టే దానికీచేస్తే నాదినం వెళ్ళిపోతుంది. ఈకొడుకు సార్లాచేసే దేమీలేదు. ఇక కొడుకైనా, కోడలైనా, మనవరాలైనా శాంతమ్మే.

'అత్తారింటికి వెళ్ళిపోయినా అది నన్ను మర్చిపోదు- మంచిరోజు చూసి నన్ను పిలిపించి తనదగ్గర పెట్టుకుంటుంది. దాన్ని నమ్ముకోడమే ఇన్నాళ్ళూ కుళ్ళబెట్టిన పాడు కోర్కె కు పరిహారం' అని నిశ్చయానికి వచ్చింది రుక్మిణమ్మ.

పందిట్లోంచి 'హిరణ్యరూప, సహిరణ్య సంమ్యగపాన్న పాత్స్వేదు హిరణ్య వర్ణః' అన్న మంత్రంవచ్చి ఆలోచనల్లోవున్న రుక్మిణమ్మని కొట్టిలేపింది. వెంటనే ఆమెలో మరొక నిశ్చయంకూడా మెరుపు దీపంలా వెలిగింది.

వెంటనే తనగదిలోకి వెళ్ళి సందగపెట్టి తెరచింది. అడుగునున్న దస్తావేజులు జాగ్రత్తగా తీసింది. ముప్ఫైయేళ్ళ నాటి దస్తావేజులు కర్పూరపు వుండల ఘాటుతో కులాసాగానే వున్నాయి. పెట్టెఅంతా వెతికి మరో ప్రోనోటు కూడా తీసింది. దస్తావేజులు ఒకటి ఇనాందారీ పట్టా భూమిది. రెండోది జిరాయితీ పట్టాది. రెండు భూఖండాలు తనకు పసుపు కుంకుమకింద పుట్టింటివాళ్ళు పెట్టినవి. ప్రోనోటు తన దగ్గరున్న నగదు తీసుకొని అల్లుడు రాసిఇచ్చినది. ప్రోనోటును చింపేదామా అనుకొని, మళ్ళా మొదటి ఉద్దేశాన్నే ఖాయపరచి మూడు కాగితాలను ఒక ఎర్ర ముఖమల్ గుడ్డలో మూటకట్టి పెట్టి మూసేసి మూటపట్టుకుని గబగబా పందిట్లోకి వచ్చింది.

పందిట్లోకి అడుగుపెట్టగానే కొడుకు ఎదురుగావచ్చి 'ఏమే, ఎన్నిసార్లు కబురుపెట్టినా కాఫీలు పంపరేం? ఇదేనా పెళ్ళివారికి మర్యాద? వెంటనే పంపించు' అని అధికారయుక్తంగా గద్దించేడు. 'వెళ్ళరా మాపెద్ద ఘనకార్యంచేస్తున్నావు. జూడానికి అయిదుసార్లు కాఫీలు చాలవూ? పెళ్ళివారికి మర్యాదా చెయ్యాలన్న జ్ఞానమే నీకుంటే గౌరీపూజ గంపను వెంటనే తెద్దువు. వెళ్ళు, వెళ్ళు. ఇంకోసారి కాఫీలేక

పోతే ఏం పుట్టిమునిగిపోదు' అని తెగచివాట్లుపెట్టి పంపించింది. ఎన్నడూ మారుమాటాడని తల్లి చివాట్లు పెట్టాక కుక్కినపేనులా వెళ్ళిపోయేడు వెంకట్రాముడు.

రుక్మిణమ్మ సంతోషంతో పౌరోహిత్యుని శిష్యుడిని పిలిచింది. వాడిచేతికి మూటయిచ్చి చెప్పవలసిన నాలుగు మాటలూ చెప్పి వంటశాలలోకి చురుగ్గా వెళిపోయింది.

'అచ్చన్నమావా! వంటలు ఎంతదాకా వచ్చాయి? అప్పడాలు అప్పుడే వేయించకు. చచ్చిపోతాయి. సద్దీ బూరెలూ ఐపోయాయా?' అని భోగట్టా చేస్తూ పనిలో మునిగిపోయింది పందిట్లోంచి పెద్దగొంతుకతో 'మీ మాతామహి శ్రీరామసుబ్బమ్మగారి భార్య రుక్మిణమ్మగారు మీ వివాహమహోత్సవ సందర్భమందు మనవరాలిని ఆశీర్వదించి అంగుళ్యాభరణాలు - సమస్తాభరణాలుకింద వెయ్యిమాటపద హార్లూ. తనతదనంతపం పసుపూ కుంకుమకింద ఐదెకరాల ఇనాం జిరాయితీ భూములు' అనేమాటలు వినబడగానే రుక్మిణమ్మ మనస్సులో 'శతమానంభవతి శతాయుః పురుష శ్శతేంద్రియ ఆయుష్యే వేందియే ప్రతిష్ఠతి' అని అనుకొంది.

ఆమెకన్నులలో ఆనందభాష్పాలు.

ఆమెమనస్సులో సంతోషతరంగాలు.

కోనా 15.6.98